క్లుప్తంగా

నూతన ఎస్‌ఐకు సన్మానం



ఎస్‌ఐ సతీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న కడదొడ్డి గ్రామస్తులు

కోసిగి: నూతనంగా ఎస్‌ఐ గా బాధ్యతలు చేపట్టిన సతీష్ కుమార్‌ను కడదొడ్డి గ్రామస్తులు సన్మానించారు. ఆదివారం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్ ఉసేని, ఐరనగల్లు శ్రీనివాస రెడ్డి, తిక్కయ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా నాడు-నేడు పనులు



కామన్‌దొడ్డిలో అదనపు గదులు కడుతున్న దృశ్యం

కోసిగి: మండలంలోని కామన్‌దొడ్డి గ్రామ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. పాఠశాలకు నాడు-నేడు రెండవ విడుత కింద రూ.20లక్షలు మంజూరయ్యాయి. దీంతో రెండు అదనపు గదులు, కాంపౌండ్ వసతులు ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాల గదులకు స్థలం కొరత ఉండడంతో రెండవ అంతస్తులో నిర్మాణాలు చేపట్టారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని నాడు-నేడు ఏఈ రంగరాజు తెలిపారు.

ఆలస్యంగా వికసించిన మే పుష్పం



టీచర్ సుశీలమ్మ ఇంటి ముందు వికసించిన మే పుష్పం

ఆదోని అర్బన్ : పట్టణంలోని శాంతి ఎస్టేట్‌లో సుశీలమ్మ ఇంటి పక్కన తోటలో మే పుష్పం శనివారం రాత్రి వికసించింది. ఆదివారం ఉదయం ఇంటి యజమానులు చూసి జూలైలో మే పుష్పం పూయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. వర్షాలు లేకపోవడంతో ఆలస్యంగా వికసించి ఉండొచ్చని వారు పేర్కొన్నారు.

పరమాన్‌దొడ్డి తండాలో కార్డెన్ సెర్చ్



మాట్లాడుతున్న డీఎస్పీ సీతరామయ్య

మంత్రాలయం రూరల్: మండలంలోని పరమాన్‌దొడ్డి తండాలో డీఎస్పీ సీతరామయ్య ఆధ్వర్యంలో సీఐలు శ్రీనివాసులు, ఎరిషావలి, మధుసూదన్, మోహన్‌రెడ్డి, ఎస్‌ఐలు తిమ్మా రెడ్డి, నరేంద్రకుమార్‌రెడ్డి, వేణుగోపాల్, మస్తాన్‌వలీ, కిరణ్‌బాబు సిబ్బంది కార్డెన్ సెర్చ్ ఆదివారం తెల్లవారుజామున నిర్వహించారు. ప్రధానంగా నాయకుల ఇళ్లల్లో సోదాలు చేపట్టారు. అలాగే నాటుసార స్థావరాలపై దాడు లు చేసి 200 లీటర్ల ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటు సారాతో పాటు సారా విక్రయి స్తున్న సుగాలి నాగరాజునాయక్, సుగాలి జయరామ్‌నాయక్, లక్ష్మీ, నీలమ్మ, కర్ణాటక మద్యం అమ్ముతున్న సుగాలి సావిత్రమ్మను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలి పారు. అలాగు బైక్‌ను సీజ్ చేశామని వివరించారు.

వంతెనలు నిర్మించాలి

ఆదోని రూరల్ : ఇస్వీ నుంచి గణేకల్ వరకు వేసిన రోడ్డులో మూడు చోట్ల వాగులు దాటేందుకు బ్రిడ్జీలు లేక రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి వంతెనలు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న కోరారు. ఆదివారం మండలంలోని ఇస్వీ చెరువు నుంచి కొండల మధ్యలో ఉన్న రోడ్డును రైతులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 300 ఎకరాలకు రైతులు, కూలీలు ఈ దారి గుండా వెళ్లాల్సి ఉందన్నారు. రైతులు గొల్ల చంద్ర, సి.నాగేంద్ర, బుడెన్‌సాబ్, మాల చిట్రి, దాదా, పి.మాబీసాబ్, మహ్మద్ పాల్గొన్నారు.

సామూహిక దీక్షలను జయప్రదం చేయండి

కౌతాళం: వీఆర్‌ఏల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఈనెల 20,21తేదీల్లో జరిగే సామూహిక దీక్షలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య పిలుపునిచ్చారు. వీఆర్‌ఏ జన రల్‌బాడీ సమావేశం ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పే స్కేల్ ఇవ్వాలని, 60సంవత్సరాలు దాటిన ప్రతి వీఆర్‌ఏ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. వీఆర్‌ఏల పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ వెంటనే పరిష్కారించాలని డిమాండ్ చేశారు. మారెప్ప, నాగరాజు, ప్రహ్లాద, తాయన్న పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

- ముమ్మరంగా సెబ్, సివిల్ పోలీసులు దాడులు
- చాకచక్యంగా ఆటకట్టిస్తున్న చెక్‌పోస్టు
- కర్ణాటక మద్యం రవాణా నియంత్రణలో నిరంతర నిఘా



ఫార్చునర్ వాహనం నుంచి భారీగా పట్టుబడిన కర్ణాటక మద్యంతో ఎమ్మిగనూరు సెబ్ అధికారులు



ట్యాంకర్‌లో మద్యం స్వాధీనం చేసుకుంటున్న మాధవరం చెక్‌పోస్టు సెబ్ అధికారులు

మంత్రాలయం : అక్రమ మద్యం మాఫియా ఆటకట్టించడానికి సెబ్, సివిల్ పోలీసు బృందాలు శ్రమిస్తున్నాయి. ప్రత్యేక నిఘాతో అక్రమ మద్యం రవాణాకు క్లెం వేస్తున్నారు. కట్టుదిట్ట చర్యలతో కట్టడి చేస్తూ శభాష్ అనిపించుకున్నారు. సినీ ఫక్కీలో తరలిపోతున్న అక్రమ రవాణాను సైతం ఛేదిస్తున్నారు. తుంగభద్ర నది తీరం ఆనుకుని ఉన్న గ్రామాల్లో రెక్కీలు నిర్వహిస్తూ మద్యం మాఫియా రెక్కలు విరుస్తున్నారు.

కర్ణాటక సరిహద్దులో చెక్‌పోస్టు..

మంత్రాలయం నియోజకవర్గాన్ని ఆనుకుని కర్ణాటక, తెలంగాణ సరిహద్దులున్నాయి. ఈ దారుల్లో బాపురం, మాధవరం, పెద్దహరివాణం, తెలంగాణ సరిహద్దులో నాగలదిన్నె, పంచలింగాల, సుంకేసుల డ్యాం వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మంత్రాలయం నియోజవర్గంలో 3 స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసు స్టేషన్లు, 2 సివిల్ సర్కిల్ స్టేషన్లు, 4 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. నియోజకవర్గంలోని రొడూరు, కుంటనహాల్, బాపురం, మేళిగనూరు, నదిచాగి, కుంబళనూరు, గుడికంబాళి, వల్లూరు, కడదొడ్డి, కందకూరు, అగసనూరు, సాతనూరు, తుంబిగనూరు, తుంగభద్ర, మాధవరం, మంత్రాలయం తుంగభద్ర నది తీర గ్రామాలున్నాయి. ఎక్కువగా ఈ గ్రామాల అడ్డదారుల్లో కర్ణాటక మద్యం తరలించే అవకాశం ఉంటుంది. అత్యధికంగా కర్ణాటక మద్యం ఎక్కువగా సరిహద్దు దాటుతోంది. కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు అడ్డకట్ట వేసేందుకు ఎవరి పరిధిలో ఆయా స్టేషన్ల సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నారు.

ముమ్మరంగా దాడులు..

సినీ ఫక్కీలో పెట్రోలియం ట్యాంకరు, ఐస్‌క్రీం డబ్బాలు, క్యారీ బ్యాగులు, పార్శిల్ సర్వీసులు, ఫార్చునర్, ఇన్నోవా లాంటి వాహనాల్లోనూ తరలించగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అరుగు అలమారుల్లోనూ అక్రమ మద్యాన్ని బయటపెట్టారు. పోలీసుల శ్రమతో మద్యం మాఫియా బెంబేలెత్తిపోతోంది. ఈ ఏడాది ఆరు నెలల్లో 83,358 మద్యం బ్యాటిళ్లు పట్టుకుని 479 కేసులు నమోదు చేశారు. 585 మందిని అదుపులోకి తీసుకుని 111 వాహనాలను సీజ్ చేశారు. మూడేళ్లలో పట్టుబడిన వాహనాలకు వేలంపాట వేయగా రూ.84,99,028 సమకూరాయి. సెబ్ పోలీసులు, సివిల్ పోలీసులు అక్రమ రవాణాపై నిరంతర నిఘాతో ముందుకు సాగుతున్నారు.



బెస్ట్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ అవార్డు అందుకుంటున్న సెబ్ సీఐ జయరామ నాయుడు

వాహనాల వేలంతో రూ.84.99 లక్షల ఆదాయం

మద్యం అక్రమ రవాణాలో పట్టుబడిన వాహనాలను వేలం నిర్వహించగా రూ.84,99,028 ప్రభుత్వానికి సమకూరింది. మంత్రాలయం, కోసిగి, ఆదోని సర్కిళ్ల పరిధిలో 320 వాహనాలకు పైగా వేలం వేశారు. వాహనాల వేలం ద్వారా మంత్రాలయం సర్కిల్‌లో అత్యల్పంగా రూ.3,45,000, ఆదోని సెబ్ సర్కిల్ పరిధిలో భారీగా రూ.37,36,234 లభించింది.

అధికారులకు ప్రశంసలు..

ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేస్తున్న పోలీస్‌శాఖ అధికారులు చక్కని పనితీరుతో ప్రశంసలు అందుకుంటున్నారు. విధులపట్ల అంకిత భావంతో పనిచేస్తూ అసాంఘిక శక్తులను అణచివేస్తున్నారు. ముఖ్యంగా అక్రమ మద్యం, నాటు సారా, అక్రమ ఇసుక తరలింపులపై ఎప్పటి కప్పుడు దాడులు చేస్తున్నారు. అందుకుగానూ ఎమ్మిగనూరు సెబ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జయరామనాయుడు రూ.10 వేలు రివార్డుతో పాటు, బెస్ట్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ అవార్డు అందుకున్నారు. కౌతాళం ఎస్‌ఐ రవీంద్రకుమార్‌రెడ్డి, ఇద్దరు కానిస్టేబుళ్లు, కోసిగి సెబ్ సర్కిల్‌లో సీఐతోపాటు కానిస్టేబుళ్లు అవార్డులు పొందారు.

వాహన వేలాల ద్వారా సమకూరిన ఆదాయం..

పోలీస్ స్టేషన్	వేలం ద్వారా వచ్చిన ఆదాయం
కౌతాళం - సివిల్	రూ. 5,32,494
కోసిగి సెబ్ సర్కిల్	రూ. 11,36,000
ఎమ్మిగనూరు సెబ్ సర్కిల్	రూ. 27,49,300,
మంత్రాలయం సివిల్ సర్కిల్	రూ. 3,45,000
ఆదోని సెబ్ సర్కిల్	రూ. 37,36,234
మొత్తం	రూ. 84,99,028

ఈ ఏడాది జనవరి నుంచి జూలై 15 తేదీ వరకు పట్టుబడిన మద్యం, కేసుల వివరాలు..

పోలీస్ స్టేషన్	కేసులు	నిందితులు	వాహనాలు	పట్టుకున్న మద్యం బ్యాటిళ్లు, టెట్రాప్యాకెట్స్
కోసిగి - సెబ్	92	105	18	14,830
కోసిగి - సివిల్	17	29	09	6,240
కౌతాళం	22	37	15	17,338
మాధవరం	17	22	03	2,737
మంత్రాలయం	10	13	02	4,500
పెద్దకడబూరు	08	08	--	350
ఎమ్మిగనూరు - సెబ్	119	124	17	2,349
ఆదోని - సెబ్	194	247	47	35,014
మొత్తం	479	585	111	83,358

మద్యం అక్రమ రవాణాపై దాడులు చేస్తున్నాం



కర్ణాటక మద్యం ప్రభావంతో ఇక్కడి మద్యం అమ్మకాలు తగ్గాయంటూ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. వాస్తవంగా ఎమ్మిగనూరు సర్కిల్ పరిధిలో గతంలో రోజుకు రూ.1.50 లక్షల వరకు అమ్మకాలు ఉండేవి. ప్రస్తుతం రోజుకు రూ.3 లక్షలకు పైగా విక్రయాలు సాగుతున్నాయి. మంత్రాలయం పరిధిలోని మాధవరం దుకాణంలో గతంలో రూ.50 వేలు ఉండగా ప్రస్తుతం రూ.లక్షకు పైగా, తుంగభద్ర వైన్ షాపులో గతంలో రూ.20 వేలు ఉంటే ప్రస్తుతం రూ.70 వేలు వరకు అమ్మకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా మద్యం అక్రమ రవాణాపై దాడులు చేస్తున్నాం. విచారణలో భాగంగా నాకు రివార్డుతోపాటు, అవార్డు సైతం వచ్చింది. అప్పటి కమిషనర్ రవిశంకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నా.

– జయరామనాయుడు, ఎమ్మిగనూరు సెబ్ సీఐ

రేయింబవళ్లు శ్రమ



అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘాతో పనిచేస్తున్నాం. నదీ తీర గ్రామాల్లో ఇన్‌ఫార్మర్లను పెట్టుకుని మద్యం రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నాం. గ్రామాల్లోనూ అవగాహన కల్పించి మద్యం రాష్ట్రంలోకి రాకుండా దాడులు చేస్తున్నాం. కర్ణాటక మద్యం ప్రభావం ఎక్కువగా ఉందంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు. అన్ని రకాలుగా మద్యం రవాణాను అడ్డుకుంటున్నాం.

– సృజన్ బాబు, కోసిగి సెబ్ సీఐ

అంధులకు అన్నగా..



అనంతపురంలో అంధ విద్యార్థి మహేష్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాజు

ఈ ఫొటోలో అంధ బాలుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పేరు రాజు. ఆదోని మండలం దిబ్బనకల్ గ్రామంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. గ్రామానికి చెందిన పలువురు అంధ విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో చదువుతున్నారు. వారిలో మహేష్ అనే బాలుడు అనంతపురంలోని ఆర్డీటీ హైస్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. సికింద్రాబాద్‌లోని దేవనార్ ఫౌండేషన్ ఫర్ ద బ్లెండ్ పాఠశాలలో లక్ష్మి చదువుకుంటోంది. బేగంపేట్‌లోని దేవరనగర్ ఫర్ ద బ్లెండ్ పాఠశాలలో అంధ విద్యార్థి లక్ష్మన్న 10వ తరగతి చదువుతున్నాడు. వీరందరికీ ప్రతి నెలా వలంటీర్ అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నాడు. ప్రతి నెల ఒకటో తేదీన ముందుగా అనంతపురం వెళ్లి మహేష్‌కు అందజేసి వెంటనే సికింద్రాబాద్ బయలుదేరి వెళ్లి ఇచ్చి వస్తున్నాడు. ప్రతి నెలా తమకు క్రమం తప్పకుండా రాజు అన్న పింఛన్ అందజేస్తున్నాడని, అంత శ్రమకోర్చి వచ్చి ఇవ్వడం సంతోషంగా ఉందని వారు చెబుతున్నారు. – ఆదోని రూరల్

రాజు అన్న అనంతపురం వచ్చి పింఛన్ ఇస్తున్నాడు



మా తల్లిదండ్రులకు నేను, అక్క సంతానం. నేను పుట్టుకతోనే అంధుడిని. అమ్మానాన్న కూలీకి పోతే తప్పా పూట గడవదు. అంధుడైన నాకు జగనన్న ప్రభుత్వం పింఛన్ వచ్చేలా చేసింది. వలంటీర్ రాజు అన్న ప్రతినెలా అనంతపురం వచ్చి పింఛన్ అందజేస్తున్నాడు. చాలా సంతోషంగా ఉంది. వలంటీర్ అన్న ఏ నెలా వదలకుండా వచ్చి ఆ సొమ్ము మొత్తం ఇస్తున్నందుకు రుణపడి ఉంటా. – మహేష్, అంధ విద్యార్థి

సంక్షేమమే తారక మంత్రంగా జగనన్న పాలన



మహిళకు అందిన పథకాలను చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం/కోసిగి : పల్లె ప్రగతి, పేదల సంక్షేమమే తారక మంత్రంగా ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం నియోజకవర్గంలోని కోసిగి మండలం కడదొడ్డి, కందకూరు గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందిన సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కడదొడ్డి నూతన కాలనీలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి పాలన సాగించిన వ్యక్తుల్లో జగనన్న ముందు వరసలో ఉంటారన్నారు. నవరత్నాల పథకాలతో కోట్లాది మంది పేదల బతుకుల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. ఇవేమీ పట్టించుకోని టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పవన్‌కు రాష్ట్రంలో అలజడులు సృష్టించే పనిలో పడ్డారని మండిపడ్డారు. చంద్రబాబును అధికారంలోకి తేవాలన్న కాంక్ష తప్ప తన పార్టీ బాగోగులు పవన్‌కు పట్టడం లేదని ఎద్దేవా చేశారు. కరువు కాటకాలకు కేరాఫ్‌గా చంద్రబాబు నిలిచారని, ప్రజలు ఆయనను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. పార్టీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ బెట్టనగౌడ్, ఎంపీపీ ఈరన్న, సర్పంచులు హనుమంతి, హుసేని, సింగిల్ విండో అధ్యక్షుడు మహంతేష్‌స్వామి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ వీరేష్, ఏపీఎం సత్యమ్మ, ఏపీఓ జయరాం, ఎస్‌ఐ సతీష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పరశురామ్, వీణ, నాయకులు నాడిగేని నరసింహులు, నాగరాజు, కామన్‌దొడ్డి నరసింహులు గౌడ, మల్లికార్జున గౌడ పాల్గొన్నారు.

తాళిబొట్టు, కాలిమెట్టెలు అందజేత



తాళిబొట్టు, కాలిమెట్టెలు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్ : మండలంలోని ఇస్వీ గ్రామానికి చెందిన దస్తగిరిసాహెబ్ మనవరాలి పెళ్లికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదివారం బంగారు చాంద్ తారా (తాళిబొట్టు), కాలిమెట్టెలను అందజేశారు. పెళ్లి కుమార్తెకు అవసరమైన తాళి, కాలిమెట్టను అందుకున్న దస్తగిరిసాహెబ్ మాట్లాడుతూ పేదరికంలో ఉన్న తమకు ఎమ్మెల్యే ఆదుకోవడం సంతోషంగా ఉందన్నారు. భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు తగదు

హాలహర్వి: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీర్ వ్యవస్థపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని హాలహర్వి జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప అన్నారు. ఆయన ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. వలంటీర్లు తమ పరిధికి మించి లబ్ధిదారులు ఉన్నచోటికే వెళ్లి సేవలందిస్తూ ప్రశంసలు పొందుతున్నారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ సకాలంలో చేరవేస్తున్నారని వివరించారు. అలాంటి వ్యవస్థపై నోరు పారేసుకున్న పవన్‌కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్ర్సాసీపీ మండల కన్వీనర్ భీమప్పచౌదరి, ఎంపీటీసీ గోపాల్, వైస్ ఎంపీపీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు

ఆదోని అర్బన్ : పట్టణంలోని కల్లుబావి, కోట్ల నగర్ చుట్టుపక్కల కాలనీవాసుల్లో ఆదివారం ఉదయం నుంచి విద్యుత్ అంతరాయం ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

అప్పు కోసం ఇరువర్గాల ఘర్షణ

ఆదోని అర్బన్ : రెండు నెలల నుంచి రూ.30 వేల అప్పునకు వడ్డీ ఇవ్వనందుకు గొళీపేటకు చెందిన యల్లప్పతో పాటు మరో నలుగురిని బోయగేరికి చెందిన మల్లికార్జున, వారి కుమారులు దాడి చేసిన సంఘటన ఆదివారం ఉదయం గొళీపేటలో చోటు చేసుకుంది. బాధితులు యల్లప్ప, ఆయన అక్క నిర్మల తెలిపిన వివరాలు.. మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్ట్ స్వీపర్‌గా పనిచేసే యల్లప్ప ఆరేళ్ల క్రితం బోయగేరికి చెందిన మల్లికార్జున అనే వ్యక్తితో రూ.30 వేలు రూ.5 వడ్డీకి తీసుకొని, నెల నెలా వడ్డీ కడుతున్నారు. అయితే రెండు నెలల నుంచి కట్టకపోవడంతో ఇంటికి రాగా.. వడ్డీ కట్టేందుకు తన వద్ద డబ్బులు ఉన్నాయని, అమ్మకు ఆరోగ్యం బాగాలేదని ఆస్పత్రిలో చూపించి సాయంత్రం కడతానని చెప్పినా వినకుండా ఇప్పుడే కట్టాల్సిందేనని కులం పేరుతో దూషించారన్నారు. అలాగే మల్లికార్జునతో పాటు వారి కుమారులు శేఖర్, సురేష్, శివ, జగదీష్, సిద్ధ, అల్లుళ్లు, తమ్ముళ్లు నాగార్జున, చిన్నా, మద్దిలేటి కలిసి తమపై దాడి చేశారని చెప్పారు. తమకు గాయలవడంతో స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ఇదిలా ఉండగా.. బోయ మల్లికార్జున కుమారులు శివ, రాజశేఖర్ మాట్లాడుతూ.. ముందుగా యల్లప్ప తన తండ్రి మల్లికార్జునకు ఫోన్ చేసి వడ్డీ ఇస్తానని రమ్మని పిలవగా తాము వెళ్లగా.. వడ్డీ, అసలు ఇవ్వను, మీపై ఎస్సీ కేసు పెడతానని బెదిరించాడని తెలిపారు. అందుకు ఆయనను నిలదీయగా..ఇంటి మిద్దెపై నుంచి రాళ్లతో దాడి చేశారని, అది తెలుసుకొని తన అన్న రాజశేఖర్‌తో పాటు తమ్ముళ్లు, వదిన వచ్చారన్నారు. వాగ్వాదం జరుగుతుండగా స్థానికులు నచ్చజెప్పడంతో వెనుదిరిగి వెళ్తుండగా యల్లప్ప ..రాజశేఖర్‌పై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైందని, మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారన్నారు. వెంటనే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

అప్రమత్తతే శ్రీరామ రక్ష

- విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి
- ఎలక్ట్రికల్ ఉపకరణాల పర్యవేక్షణ తప్పనిసరి
- జాగ్రత్తలు పాటించకుంటే ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదం



ఆదోని అర్బన్ : వర్షాకాలం ఆరంభమైంది. ఓ వైపు పిడుగులు, ఉరుములు, మెరుపులు, మరో వైపు ఈదురు గాలులకు నేలకొరుగుతున్న విద్యుత్ స్తంభాలు, వృక్షాలు. ఇలాంటివి జరుగుతున్న సమయంలో విద్యుత్ తీగలు కిందకు పడడం, తడిగా ఉన్న విద్యుత్ స్తంభాల కారణంగా విద్యుత్ షాక్ ప్రమాదాలను తెచ్చిపెడుతోంది.

విద్యుత్ షాక్‌కు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు..

- తడి చేతులతో, తడిచి ఉన్న విద్యుత్ పరికరాలను తాకరాదు.
- విద్యుత్ పనులు సొంతంగా నిర్వహించుకోరాదు.
- విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నా, వేలాడుతున్నా పట్టుకోరాదు. అటు వైపు ఎవరినీ వెళ్లకుండా చూడాలి. సంబంధిత లైన్‌మెన్, అధికారికి సమాచారం ఇవ్వాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు పోయినప్పుడు సొంతంగా వేయరాదు.
- విద్యుత్ స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్లపైకి అనధికారిక వ్యక్తులు ఎక్కరాదు.
- మోటార్ సామర్థ్యానికి గల నాణ్యత కలిగిన తీగలను వాడాలి.
- సర్వీసు వైర్లు అతుకులు, జాయింట్లు వదులుగా ఉండడం, స్టార్టర్‌లు, తీగలను నేలపై పెట్టడం ప్రమాదకరం. స్టార్టర్‌కు పైకప్పు తొలగించరాదు. స్టార్టర్ ఉంచిన ఐరన్ బాక్సును తెరిచే సమయంలో జాగ్రత్తగా ఉంచాలి. మోటార్‌కు తప్పనిసరిగా ఎర్తింగ్ చేయించుకోవాలి. తడి ఉన్నప్పుడు పంపుసెట్‌ను ఆన్ చేయరాదు.
- విద్యుత్ లైన్ల కింద చెట్లు నాటడం, తీగలకు తాకిన చెట్టు, కొమ్మలను ఎక్కరాదు.
- స్తంభాలకు ఆధారంగా ఉన్న స్టే తీగను తొలగించడం, వాటికి పశువులను కట్టివేయరాదు. పొలంలో తెగిపడి ఉన్న తీగలను చేతితో తొలగించడం, పక్కకు జరపరాదు.
- పొడవైన ఇనుపరాడ్లు, బోరుపైపులు, కేసింగ్ పైపులు తీసుకెళ్లేటప్పుడు విద్యుత్ తీగలకు తాకకుండా జాగ్రత్తలు వహించాలి.
- ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే వెంటనే స్విచ్ ఆఫ్ చేసి ప్లాస్టిక్ లేదా పొడవాటి కర్రతో ఆ వ్యక్తిని తప్పించాలి.
- ఐఎస్‌ఐ మార్కు కలిగిన పంపుసెట్ వాడడం వల్ల కరెంట్ పొదుపు అవ్వడంతో పాటు ప్రమాదాలను నివారించవచ్చు.
- మోటార్‌లకు కెపాసిటర్‌లను పెట్టుకోవడం వల్ల కరెంట్ ఆదాతో పాటు ఓల్టేజీ సమస్య తగ్గుతుంది.
- ప్రతి ఇంట్లో విద్యుత్‌సర్వీసుకు ఎర్తు పైపు ద్వారా ఎర్తింగ్‌ను ఏర్పాటు చేయాలి.
- ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగితే విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912 కి తెలియజేయాలి.

డివిజన్ పరిధిలో 3.90 లక్షలు గృహ, 70 వేలు వ్యవసాయ, 740 పరిశ్రమల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. సబ్ డివిజన్ పరిధిలో 1,12,945 గృహాలు, 9,009 వ్యవసాయ, 524 పరిశ్రమ కనెక్షన్లు ఉన్నాయి.

- ఈ ఏడాది జనవరిలో మండలంలోని బసాపురం గ్రామ పొలంలో కొత్త లైన్ ట్రాన్స్‌ఫార్మర్ వేయడానికి కాంట్రాక్టర్ తరఫున వచ్చిన అదే గ్రామానికి చెందిన గోవింద్ విద్యుత్ సరఫరాను గమనించకపోవడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు.
- గతేడాది డిసెంబర్ నెలలో పట్టణంలోని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు వద్ద లారీ నుంచి వస్తువులు అన్‌లోడ్ చేస్తుండగా పైన విద్యుత్ తీగలు చూసుకోకపోవడంతో పట్టణానికి చెందిన చుక్క హనుమంతు విద్యుత్ తీగలు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు.
- గతేడాది జూన్‌లో కౌతాళం మండలంలోని లింగారెడ్డి మిద్దెపై పావురాలను ఎగరవేసే సమయంలో మిద్దెకు సమీపంలోని విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై గాయాలపాలయ్యాడు.

ఇలా.. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు ఆరుగురు విద్యుత్‌షాక్‌కు గురై మరణించగా, మరో ఇద్దరు ప్రాణాల నుంచి బయటపడి గాయాలపాలయ్యారు. ఇలాంటివి పరిశ్రమలు, ఇళ్లల్లోనూ, పొలాల్లోనూ ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట షాక్‌కు గురై కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు గాయాల పాలవుతున్నారు. అయితే ప్రమాదాల బారిన పడకుండా విద్యుత్ శాఖ అధికారులు జాగ్రత్తలను వివరిస్తున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ముప్పు



పరిశ్రమలు, ఇళ్లల్లో, వ్యవసాయ పనుల్లో విద్యు త్ పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ప్రమాదం . విద్యుత్ సమస్య వస్తే వెంటనే 1912కు సమాచారం ఇవ్వండి. లేదా దగ్గరలోనే విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేయండి. సొంతంగా పరిష్కారానికి వెళ్లరాదు. విద్యుత్‌పై తగిన జాగ్రత్త లు, సూచనల కోసం ప్రజలకు, పరిశ్రమల యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం.

– పురుషోత్తం, విద్యుత్‌శాఖ ఏడీఈ

పండ్ల తోటల సాగులో రాణించాలి

దేవనకొండ: రైతులు పండ్లతోటల సాగులో రాణించాలని 'సే ట్రీస్' సంస్థ రీజనల్ మేనేజర్ పి.మనోహర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కప్పట్రాళ్ల గ్రామంలోని తానా స్త్రీశక్తి భవనంలో హార్టికల్చర్ రైతులతో సమావేశమయ్యారు. సంస్థ రీజినల్ మేనేజర్ పి.మనోహర్ మాట్లాడుతూ.. బహుళ అంతస్థు పండ్లతోటల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. ఒకే రకమైన పండ్ల తోటలు సాగు చేయడం ద్వారా రైతులు లాభాలు ఆర్జించడం లేదన్నారు. ఐదు రకాల పండ్ల మొక్కలతో బహుళ అంతస్తుల విధానంలో పండ్ల తోటలను ప్రోత్సహిస్తున్నామన్నారు. అలాగే రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేందుకు బయోగ్యాస్ యూనిట్స్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. వాటి ద్వారా వచ్చే వ్యర్థాలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఉపయోగించేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రోగ్రాం మేనేజర్ బి.నారాయణ, రిసోర్స్‌పర్సన్ చింతమాను రవికుమార్, కప్పట్రాళ్ల మల్లికార్జున, చాకలి లక్ష్మన్న, ఉరుకుందగౌడ్, వారం రమణయ్య, రైతులు పాల్గొన్నారు.

కొత్త బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

ఆదోని రూరల్ : పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న పాత ఫ్లై ఓవర్ స్థానంలో కొత్త ఫ్లై ఓవర్ నిర్మించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న, పట్టణ నాయకులు వీరేష్, నాగేంద్ర, నాగరాజు కోరారు. ఆదివారం వారు పట్టణంలోని న్యూ గాంధీనగర్, క్రాంతినగర్, లేబర్ కాలనీ, సీఆర్ నగర్, శంకర్‌నగర్, కల్లుబావి, బీసీ కాలనీ, ప్రకాష్‌నగర్ కాలనీల్లో పర్యటించారు. ఆదోని, కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు ఆదోని నుంచి కర్నూలు వరకు జరిగే సీపీఎం మహా పాదయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ కరపత్రాలను పంచారు. తెలుగు ఈరన్న, గోస్, మునెప్ప, రాజు, మనోహర్, నాగరాజు పాల్గొన్నారు.

వర్షం కోసం విరాట పర్వం పఠనం

ఆస్పరి: శంకరబండ గ్రామంలో వెలసిన లింగమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వర్షం కోసం గ్రామస్తులు గురప్ప, నారాయణరెడ్డి విరాట పర్వం పఠించారు.